గోటి తలంబ్రాల కార్యక్రమం ప్రారంభం



గోటి తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొన్న ధర్మ జాగరణ సమితి నిర్వాహకులు, భక్తులు

ఆల్విన్‌కాలనీ: భద్రాచలం సీతారామచంద్రస్వామి కల్యాణం కోసం గోటి తలంబ్రాల కార్యక్రమం శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి, సుమిత్రానగర్‌లోని కనకదుర్గ దేవాలయంలో ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి శ్రీ రామ జయరామ నామస్మరణతో ఆ పరిసర ప్రాంతాలు మారుమ్రోగాయి. గోటి తలంబ్రాలను భక్తులకు అందజేశారు. వాటిని వలిచి ధర్మ జాగరణ సమితి సభ్యులకు అందజేస్తారు. వీటిని భద్రాచలం సీతారాముల కల్యాణంలో అక్షింతలుగా వినియోగించటానికి ఆలయ అర్చకులకు అందజేయనున్నామని నిర్వాహకులు భోములే శంకర్, నామాల శ్రీనివాస్ నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు అనంత శర్మ, సభ్యులు నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చాకలి ఐలమ్మ స్త్రీ శక్తి పురస్కారాలు



అవార్డు అందుకున్న మహిళలతో బండి రమేష్

ఆల్విన్‌కాలనీ: సాయి అలేఖ్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రెమెడి హాస్పిటల్స్ సౌజన్యంతో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మూసాపేట వై జంక్షన్‌లోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలకు చాకలి ఐలమ్మ స్త్రీ శక్తి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్థ అధ్యక్షురాలు అరుణను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, పుష్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాల అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ నరసింహరాజు

బాలానగర్: ప్రపంచ దేశాల అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని బాలానగర్ సీఐ నరసింహరాజు అన్నారు. శ్రీశ్రీనగర్ లోని సీఐటీయూ భాస్కర్‌రావు భవన్‌లో శుక్రవారం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం శ్రామిక మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, అనిత, సబియా, బాషమ్మ, దీప్తి, జీనా మానిక, భాగ్యలక్ష్మి, సంతోష్ బాయ్, వినోద, జైథున్, సంగీత, అంబికా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు వసతులు కల్పించాలి

కూకట్‌పల్లి: మానసిక దివ్యాంగులకు సరైన వసతులు కల్పించాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బాలాజీనగర్‌లో పాఠశాల తరగతి గదిలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల తరగతి గదిని శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో ఒక స్టోర్ రూంలో అత్యంత దయనీయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలకృత్యాలకు కూడా దూరంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జనరల్ సెక్రటరీ ఆకుల రామ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎమ్మెస్ రెడ్డి, సీనియర్ నాయకులు వినోద్ కుమార్, మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ లహరి తదితరులు పాల్గొన్నారు.



తరగతి గదిని పరిశీలిస్తున్న నాయకులు

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



సంక్షేమ సంఘం అధ్యక్షులు రాంరెడ్డిని సన్మానిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్

మోతీనగర్: కాలనీ సంఘాలు కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని సనత్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. అల్లాపూర్ డివిజన్ న్యూ రామారావు నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన కె. రాంరెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కాలనీ, బస్తీల్లో అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ ఎస్. కేశవ రావు, సలహాదారులు అమరేందర్, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, గంగారెడ్డి, తోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అతివలపై అఘాయిత్యాలు ఆగినప్పుడే నిజమైన సాధికారత

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్ర వారం హైబీజ్ టీవీ అధ్వర్యంలో ఉమెన్స్ లీడర్‌షిప్ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అతివలపై అఘాయిత్యాలు ఆగినప్పుడే వారు నిజమైన సాధికారత సాధించినట్టవుతుందన్నారు. అతివలకందరికీ మహిళా కమిషన్ అండగా ఉంటుందని తెలిపారు. సరస్వతి బాయి రాణీని లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారంతో సత్కరించారు. వివిధ రంగాలలో అత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు 70 మందికి పైగా ఉమెన్స్ లీడర్‌షిప్ అవార్డులను అందజేశారు. టీజీ అయిల్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ యాస్మీన్ బాషా, ఇండియాక్రోన్ విన్నర్ డాక్టర్ ప్రీతి అడుసుమిల్లి, మా రీసర్చ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సునితా జి కుమార్, మల్లారెడ్డి విశ్వ విద్యాలయం హైదరాబాద్ చైర్‌పర్సన్ డాక్టర్ సి.హెచ్. ప్రీతిరెడ్డి, హైబీజ్ టీవీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రాజగోపాల్, హైబీజ్ టీవీ ఎల్ఎల్‌పీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జె.సంధ్యారాణి పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణకు 'పెల్వీ ఈజ్' దోహదం



'పెల్వీ ఈజ్' వైద్య పరికరాన్ని ప్రారంభిస్తున్న వీసీ కిషన్ కుమార్ రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: మహిళల ఆరోగ్య సంరక్షణకు దోహదపడేందుకు టికారో ఇన్నోవ్ సంస్థ రూపొందించిన 'పెల్వీ ఈజ్' వైద్య పరికరాన్ని జేఎన్‌టీయూహెచ్‌లో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ వీసీ, ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, అంతర్జాతీయ ప్రఖ్యాత పెల్విక్ హెల్త్ ఎడ్యుకేటర్ డా. సునీత పటేల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జేఎన్‌టీయూహెచ్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌లో అభివృద్ధి చెందిన టికారో ఇన్నోవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రసూతి, గైనకాలజీ, ప్రసవానంతర సంరక్షణ, కాస్మొటిక్ రీకన్‌స్ట్రక్షన్ వంటి రంగాల్లో అధునాతన, ఖర్చు తగ్గిన వైద్య పరిష్కారాలను చూపుతుందని సంస్థ వ్యవస్థాపకులు, పూర్వ విద్యార్థి నిశాంత్ కుమార్ మార్తా తెలిపారు. 'పెల్వీ ఈజ్'ను పరిచయం చేస్తూ దాని ద్వారా పెల్విక్ ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వినూత్న సాంకేతిక పరిష్కారాలను ఎలా అందిస్తుందో వివరించారు. అనంతరం వీసీ కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్య సమస్యల కంటే వాటిపై ఉన్న సామాజిక మౌనం పెద్ద సమస్య అని అన్నారు. కేవలం 22 సంవత్సరాల వయసులోనే నిశాంత్ మార్తా టికారోను స్థాపించి అపూర్వ విజయాన్ని సాధించారని అభినందించారు. కార్యక్రమంలో ఆరోగ్య నిపుణులు, విద్యార్థిలు తదితరులు పాల్గొన్నారు.

సేవకు సలామ్..

- వివిధ వృత్తుల్లో రాణిస్తున్న మహిళలు
- మరో వైపు సేవా కార్యక్రమాలు
- ఆదర్శంగా నిలుస్తున్న అతివలు

వంటింటి కుందేళ్లు అన్న నోళ్లను మూయించారు. ఆడ పిల్లకు చదువు ఎందుకు అన్న వారిని ఎదురించారు. ఇంట్లో నుంచి బయటకు కాలు పెడితే పరువు పోతుందన్న రాచరిక నాగరికాన్ని చెరిపేశారు. వెరిసి ఇప్పుడు అంతరిక్షంలో మొట్ట మొదటి సారిగా పాదం మోపిన ఘనత మహిళదే. ఆటో డ్రైవర్ నుంచి మొదలు పెడితే ట్రైన్ లోకో పైలెట్ దాకా.. అక్కడి నుంచి ఎన్నో రంగాల్లో ఆకాశమే హద్దుగా పురుషులకు దీటుగా మహిళలు రాణిస్తున్నారు. ఆదర్శంగా నిలుస్తున్న నేటి మేటి మహిళలు సాధిస్తున్న పురోగతిని అభినందిస్తూ మహిళా లోకానికి ప్రత్యేకంగా 'ఉమెన్స్ డే' శుభాకాంక్షలు. నియోజకవర్గంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.. – జోన్‌బృందం

పుట్టి పెరిగిన ప్రాంతంలోనే..



కూకట్‌పల్లి: నడుస్తున్న సమాజంలో మహిళలు పుట్టినిల్లు, మెట్టినిల్లు పేరుతో ప్రాంతాలు మారి కొత్త పరిచయాలతో పాటు తమ జీవన విధానాన్ని మార్చుకోవాల్సి వస్తుంది. కానీ పుట్టిన ప్రాంతాన్ని విడవకుండా చదువుతో పాటు ఉద్యోగాన్ని కూడా చేస్తూ తాను పుట్టి పెరిగిన ప్రాంతంలోనే ప్రజలకు సేవ చేస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ డిపార్టుమెంట్‌లో డీజీఎం నాగప్రియ. నాగప్రియ మియాపూర్ సమీపంలో జేపీ నగర్ నుంచి తన జీవన ప్రస్థానాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ డిపార్టుమెంట్‌లో మేనేజర్‌గా ఉద్యోగంలో చేరారు. 2009 నుంచి వివిధ హోదాల్లో కూకట్‌పల్లి, మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లో పనిచేశారు. ప్రస్తుతం కూకట్‌పల్లి ప్రాంతంలో డీజీఎంగా పనిచేస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ నీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకండా కృషి చేస్తున్నారు. నిబద్ధతతో పనిచేస్తూ అభినందనలు పొందారు.

నలుగురికీ ఉపాధి కల్పిస్తూ..



మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడకు చెందిన కొత్తపల్లి శ్రీదేవి ఓ ప్రైవేట్ సంస్థలో రూ.10 వేల జీతానికి పని చేసేది. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. ప్రభుత్వ పథకాలను తెలుసుకున్నది. కొన్ని సంవత్సరాల క్రితం పొదుపు సంఘంలో చేరి అధికారుల ప్రోత్సాహంతో ఎంబ్రాయిడరీ టైలరింగ్ షాపు ఏర్పాటు చేసుకుంది. దేవి ప్యాషన్ షాపు ద్వారా మరో ఐదుగురికి ఉపాధి కల్పించింది. వ్యాపారంతో పాటు తన పిల్లలను ఉన్నతస్థాయి చదువులు చదివించింది. ప్రస్తుతం తన ఇద్దరు కుమార్తెలు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.

ఎదుగుతూ.. ఇతరులకు దారి చూపిస్తూ..



బాలానగర్: ఆమె జీవనమే పోరాటం. తాను జీవిస్తూ పది మందికి అండగా నిలుస్తోంది బాలానగర్‌కు చెందిన మట్టే మధులత. చిన్నతనంలోనే పెళ్లి, రెండు సంవత్సరాలలోనే విడాకులు. ఒంటరిగా జీవన పోరాటం మొదలు పెట్టింది. ఓ ప్రైవేట్ కంపెనీలో చిరు ఉద్యోగిగా పనిచేస్తూ స్వయం సహాయక గ్రూపులు ప్రారంభించింది. గ్రూపులో లోన్ తీసుకొని బట్టల వ్యాపారం ప్రారంభించింది. తన చేతిలో కొంత నగదు కనబడుతుండటంతో తనలా జీవితంలో ఒంటరిగా బతుకుతున్న మహిళలకు తోడ్పాటు అందించాలని భావించింది. స్వచ్ఛంద సంస్థల సహకారంతో టైలరింగ్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, బ్యూటీషియన్ ట్రెనింగ్ ఇప్పించి చాలా మంది మహిళలకు ఉపాధికి దారి చూపించింది. భర్తను కోల్పోయిన వారు, విడాకులు తీసుకున్నవారు, దివ్యాంగుల మహిళలకు ఆమె అండగా నిలుస్తోంది. అంతేకాకుండా దివ్యాంగుడైన తమ్ముడి కొడుకును పెంచి పెద్ద చేసింది. అదేవిధంగా అనాథ పిల్లలకు చేయూతనిచ్చింది. కరోనా సమయంలో 40 రోజుల పాటు ఎంతో మంది పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు ఓ స్వచ్ఛంద సంస్థ నుంచి అందజేసింది. దీనికి గాను కరోనా వారియర్ అవార్డు వచ్చింది. ఆమె సామాజిక సేవకురాలిగి గుర్తింపు పొందింది.

దాడి చేసిన పూర్వ విద్యార్థుల అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: రాత్రి వేళల్లో మద్యం సేవించి యూనివర్సిటీలోకి వచ్చిన ఐదుగురు పూర్వ విద్యార్థులు జూనియర్ విద్యార్థులపై దాడి చేశారు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గురువారం రాత్రి కౌశిక్, సుజయ్ అనే ఇద్దరు విద్యార్థులు గ్రౌండ్ నుంచి హాస్టల్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో రెండు బైకులపై వచ్చిన గుడిపాటి రాజా దీక్షిత్, యశ్వంత్ సాగర్, సిద్దార్థ్, కిరణ్ గౌడ్ వారిని అడ్డగించి దాడి చేశారు. కౌశిక్ వారి నుంచి దూరంగా పరిగెత్తాడు. పట్టుకొని దుర్భాషలాడుతూ చితకబాదారు. అంతేకాకుండా ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో.. మా విషయాల్లో దూరితే ఇలాగే ఉంటుందని హెచ్చరించి వెళ్లిపోయారు. కౌశిక్‌తో పాటు తోటి విద్యార్థుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. కాగా నిందితులు డిటెండ్ అయిన పూర్వ విద్యార్థులని పోలీసులు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు

కుత్బుల్లాపూర్: దాబాల్లో అక్రమ సిట్టింగ్ నిర్వహించి మద్యం విక్రయాలు చేపడుతున్న వ్యక్తులను పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ విజయవర్ధన్ ఆధ్వర్యంలో కొంపల్లి, దూలపల్లి, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో విజిబుల్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. స్టీల్ సిటీ రోడ్డులో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. బైసాకి దాబా, న్యూ ఫ్యామిలీ దాబాలో మద్యం విక్రయాలతో పాటు సిట్టింగ్ ఏర్పాటు చేసిన విషయంపై కేసు నమోదు చేశారు. ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలతో పాటు దాబాల్లో సెట్టింగ్‌లకు అవకాశం లేదని, అలా చేస్తే తప్పకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

రూ. 2 లక్షల విలువైన సామగ్రి స్వాధీనం

మియాపూర్: నిర్మాణంలో ఉన్న భవనంలోని సామగ్రి చోరీకి పాల్పడిన వ్యక్తిని మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. డీఐ రమేష్ నాయుడు సమాచారం మేరకు... శ్రీకాకుళంకు చెందిన రాజేష్ కుమార్(30) మియాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. సులభంగా డబ్బు సంపాదించేందుకు నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద సామగ్రిని దొంగతనం చేస్తూ జల్సాలకు పాల్పడుతుండేవాడు. ఈ క్రమంలో మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంజీరారోడ్డులో నిర్మాణంలో ఉన్న ఆదిత్య ఫార్చ్యూన్ అపార్ట్‌మెంట్‌లో వాటర్ డైవర్షన్ ట్యాప్‌లను దొంగతనం చేశాడు. ఒక్కో ట్యాప్ సుమారు రూ. 3,500 ఉంటుంది. ట్యాప్‌లు లేవని గ్రహించిన సైట్ ఇంచార్జీ మురళి ఈ నెల 4వ తేదీన మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా రాజేష్ కుమార్‌ను అదుపులోకి తీసుకు విచారించగా ఆ ట్యాప్‌ల సామగ్రిని దొంగిలించినట్లు అంగీకరించాడు. అతని నుంచి సుమారు రూ. 2 లక్షల విలువచేసే ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. రాజేష్ కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించామని డీఐ రమేష్ నాయుడు వివరించారు.

బీజేపీ విజయోత్సవ సంబురాలు



బాలానగర్: రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడంతో ఫతేనగర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుడు కంచి మహేందర్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఫతేనగర్ పైపులైన్ రోడ్డు నుంచి ఫ్లై ఓవర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోకపోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అని అన్నారు. కార్యక్రమంలో కె. గోపాల్, మొర అశోక్, సురేష్, యాదగిరి, బేతి రమేష్, హరిప్రసాద్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో పీజేఆర్ నగర్ యువశక్తి మహిళా మండలి, హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్స్ సహకారంతో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై ప్రారంభించారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, పాండుగౌడ్, రవి, పోశెట్టి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలల మధ్య జన్మదిన వేడుకలు



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి జన్మదిన వేడుకలను శుక్రవారం ఆమె నివాసంలో నాయశ్రీ ఫౌండేషన్ అనాథ బాలలతో కలిసి జరుపుకున్నారు. కేక్ కట్ చేసి అందజేశారు. నాయశ్రీ ఫౌండేషన్‌కు ఫ్యాన్లను విరాళంగా అందజేశారు.

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆడపడుచులకు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. నేడు అన్ని రంగాల్లోనూ మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తూ ముందుకు వెళ్తున్నారని తెలిపారు. స్త్రీ లేనిదే జననం లేదని, భూదేవి అంత ఓర్పు ఉన్న ఆ స్త్రీ మూర్తికి మనం ఏమి ఇచ్చినా రుణం తీర్చుకోలేమన్నారు.

వంద పడకల ఆసుపత్రి నిర్మించాలని వినతి



ఆరోగ్య శాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న శేరి సతీష్ రెడ్డి

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి నిర్మించాలని కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. 10 సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో సంజీవరావు, గోపిశెట్టి రాఘవేందర్, మేకల మైఖేల్, తూము సంతోష్‌కుమార్, దేవ సహాయం, రవి, సతీష్ గౌడ్, బండిగ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



యాదగిరి (ఫైల్)

మూసాపేట: ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శంషీగూడ, ఇంద్రాహిల్స్‌కు చెందిన మంజాల యాదగిరి (42) ఈ నెల 1వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో, బంధువుల వద్ద ఆరా తీసినా సమాచారం లభించలేదు. దీంతో పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రగ్స్ పట్టివేత

- ఇద్దరు వ్యక్తుల అరెస్ట్
- నిందితుల్లో ఒకరు నైజీరియన్

కేపీహెచ్‌బీకాలనీ: డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ నైజీరియన్‌తో పాటు మరో వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే..అడ్డగుట్ట సొసైటీలోని రోడ్డు పక్కన గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించిన పోలీసులు నైజీరియాకు చెందిన వ్యక్తి మరో వ్యక్తితో కలిసి డ్రగ్స్ విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. వారి నుంచి 20 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరు డ్రగ్స్ డ్రగ్స్ ఎక్కడి నుంచి తెచ్చారు. ఎవరెవరికి సరఫరా చేశారు అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.

ఎంఎల్ఆర్ఐటీఎంలో ఏఐఎస్‌టీఎం అంతర్జాతీయ సదస్సు



ఏఐఎస్‌టీఎం బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీఎం కళాశాలలో అప్లికేషన్స్ ఆఫ్ ఏఐ ఇన్‌స్మార్ట్ టెక్నాలజీస్ అండ్ మ్యానుఫాక్చరింగ్ (ఏఐఎస్‌టీఎం) పేరిట రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సదస్సును ఎంఎల్ఆర్ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డీఆర్‌డీఓ సైంటిస్ట్ డాక్టర్ ఎన్.కిషోర్‌నాథ్, గౌరవ అతిథిగా టర్కీకి చెందిన రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎర్డెమ్‌కుచె పాల్గొన్నారు. యూఎస్ఏ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీ, మహారాష్ట్ర వంటి 13 ప్రాతినిధ్య ప్రాంతాల నుంచి 270 పరిశోధనా పత్రాలు అందజేయగా 130 పత్రాలను ప్రచురణకు అంగీకరించారు. ఏఐ ఆధారిత ఉత్పత్తి రంగాల అభివృద్ధి, మెషిన్ లెర్నింగ్, ఐఓటీ, రోబోటిక్స్, గ్రీన్ టెక్నాలజీస్ వంటి పలు కీలక అంశాలపై సెమినార్లు, ప్యానెల్ డిస్కషన్లు, పరిశోధన పత్రాల సమర్పణలు జరుగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఏఐఎస్‌టీఎం 2025 సదస్సు ద్వారా పరిశ్రమ-అకడామిక్ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, పరిశోధనలో నూతన మార్గాలను అన్వేషించడం, కృత్రిమ మేధస్సుతో ఉత్పత్తి రంగాన్ని మెరుగుపరచడం ప్రధాన లక్ష్యం అని నిర్వాహకులు తెలిపారు.